జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO: APTEL/26/A7657

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ ‖ సంపుటి:1 ‖ సంచిక: 24 ‖ గురువారం ‖ 8-10-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

09 అక్టోబర్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:11 సూర్యాస్తమయం - సా. 5:55 తిథి చతుర్దశి రా. 9:38 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) రా. 9:17 వరకు తరువాత హస్త యోగం బ్రహ్మ రా. 11:14 వరకు కరణం విష్టి ఉ. 9:54 వరకు శకుని రా. 9:38 వరకు వర్జ్యం తె. 5:51 నుండి ఉ. 7:28 వరకు దుర్ముహూర్తం ఉ. 8:32 నుండి ఉ. 9:19 వరకు మ. 12:26 నుండి మ. 1:13 వరకు రాహుకాలం ఉ. 10:35 నుండి మ. 12:03 వరకు యమగండం మ. 2:59 నుండి సా. 4:27 వరకు గుళికాకాలం ఉ. 7:39 నుండి ఉ. 9:07 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:35 నుండి తె. 5:23 వరకు అమృత ఘడియలు మ. 2:07 నుండి మ. 3:43 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:39 నుండి మ. 12:26 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## బీసీ గర్జనకు వైసీపీ సై

### విశాఖ వేదికగా ఉత్తరాంధ్రలో బీసీ గర్జన

### 16న వైసీపీ బహిరంగ సభ

### బీసీల రిజర్వేషన్లు, సమస్యలపై ఫోకస్

విశాఖ: ఉత్తరాంధ్రలో మళ్లీ రాజకీయ పట్టు సాధించేందుకు వైఎస్సార్‌సీపీ బీసీ అస్త్రాన్ని తెరపైకి తెస్తోందా? ఈ నెల 16న విశాఖలో నిర్వహించనున్న ఉత్తరాంధ్ర బీసీ గర్జన సభ ఇప్పుడు ఇదే చర్చకు తెరతీసింది. బీసీ రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం, బీసీ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలను ప్రధాన అంశాలుగా చేసుకుని ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వైసీపీ సిద్ధమవుతోంది. అయితే ఇది కేవలం బీసీల హక్కుల కోసం నిర్వహిస్తున్న సభా? లేక తరువాయి 2 వ పేజీలో..



## బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు

### ఏపీ స్థానిక సంస్థల ఎన్నికలపై కసరత్తు

### సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఎన్నికలు

### దశల వారీగా ఎన్నికల నిర్వహణ

### బ్యాలెట్‌తోనే స్థానిక ఎన్నికలు:ఎస్ఈసీ

అమరావతి: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఈసారి ఈవీఎంలకు బదులుగా పూర్తిగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాలపై తుది తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల నిర్వహణకు పూర్తిగా సిద్ధమవుతామని ఆయన వెల్లడించారు. ఎన్నికల కోసం గత రెండు నెలలుగా అవసరమైన తరువాయి 2 వ పేజీలో..



## గోదావరి పుష్కరాలకు...
# నిధులివ్వండి

## ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ

### గోదావరి పుష్కరాలు, నిధుల అభ్యర్థన.. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై వినతి

ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో గురువారం సాయంత్రం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి పుష్కరాలు, పోలవరం, గోదావరి--కావేరి నదుల అనుసంధానం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై చర్చించారు. అలాగే మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీ ప్రజల తరపున చంద్రబాబు అభినందనలు తెలిపారు.

న్యూఢిల్లీ: నీటిపారుదల రంగంలో గోదావరి--కావేరి నదుల అనుసంధానం ద్వారా ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందని చంద్రబాబు వివరించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లను వివరించి, అభివృద్ధి పనులకు కేంద్ర ఆర్థిక తరువాయి 2 వ పేజీలో..



2

## ఈసీ నియామకాలపై సుప్రీంకోర్టులో పిటిషన్

### ఈసీ నియామకాలపై క్వో వారంటో పిటిషన్

### ఎన్నికల కమిషన్ నియామకాలపై న్యాయపోరాటం

## జగన్ హిందువుగా మారాలి

### రాజకీయాల్లోకి వచ్చుడు పక్కా

### త్వరలోనే పార్టీని ప్రకటిస్తా: విజయసాయి

### మతం, రాజకీయాలపై వ్యాఖ్యలు

### తిరుపతిపై కీలక ప్రతిపాదనలు

### లడ్డూ, నెయ్యి వ్యవహారంపై ప్రశ్నలు



తిరుపతి:రాజకీయాల్లోకి తిరిగి రావడం ఖాయమని, త్వరలోనే కొత్త పార్టీని ప్రకటిస్తానని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి తెలిపారు. దసరా తర్వాత పార్టీ ప్రకటన ఉంటుందని చెబుతూ.. అన్ని కులాలు, మతాలను గౌరవిస్తూ అందరినీ కలుపుకుపోతామని అన్నారు. గురువారం ఆయన తిరుపతిలో మీడియాతో తరువాయి 2 వ పేజీలో..

## జనసేనకు 5 మేయర్ సీట్లు?

### టీడీపీ,జనసేన మధ్య సీట్ల సర్దుబాటు

### విజయవాడపై ఎవరి పట్టు?

### ప్రచారం వేరు.. అధికారిక నిర్ణయం వేరు

### కూటమిలో అసలు లెక్కలేంటి?

అమరావతి: ఏపీలో స్థానిక సమరం వేడెక్కుతున్న వేళ.. జనసేనకు ఐదు కీలక మేయర్ స్థానాలు కేటాయించారనే ప్రచారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాకినాడ, మచిలీపట్నం, విజయవాడ, ఒంగోలు, తిరుపతి మేయర్ స్థానాలు జనసేన ఖాతాలోకి వెళ్తాయనే టాక్ వినిపిస్తోంది. అయితే ఇక్కడే అసలు ట్విస్ట్ తరువాయి 2 వ పేజీలో..



4

## మొబైల్.. సుపరిపాలనకు వారధి

### ప్రజల అరచేతిలో ప్రభుత్వ సేవలు

### డీబీటీతో రూ.5 లక్షల కోట్ల ఆదా

### దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ చేరింది

### IMC-2026లో మోదీ కీలక వ్యాఖ్యలు



4

## కెనడా రచయిత్రికి నోబెల్ పురస్కారం

### సమకాలీన సాహిత్యంలో కొత్త రూపాలు సృష్టి

### కెనడా రచయిత్రి ఆన్ కార్సన్‌కు నోబెల్



## టీడీపీ గూటికి 300 మంది

### సాయి సంజయ్ వెంట 300 మంది.. బొండా ఉమా సమక్షంలో చేరిక

పాయకపురంలోని ఎంఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో వ్యాపారవేత్త సాయి సంజయ్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ యువ నాయకుడు బొండా సిద్ధార్థ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కొత్తగా చేరిన వారికి బొండా ఉమా పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. 4

# నేటి రాశి ఫలాలు

మేషం: వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొన్ని ఇబ్బందులు తప్పవు. ముఖ్యమైన వ్యవహారాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఋణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది.

వృషభం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. చిన్ననాటి మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. వ్యాపారాలలో విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. ఆప్తుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మిధునం: అధికారుల అనుగ్రహంతో పదోన్నతుల పెరుగుతాయి. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుతాయి. నిరుద్యోగుల కలలు సాకారం అవుతాయి. కొన్ని వ్యవహారాలలో సన్నిహితుల సహాయసహకారాలతో ముందుకు సాగుతారు. చేపట్టిన పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి కీలక సమాచారం అందుతుంది.

కర్కాటకం: ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది. నూతన ప్రయత్నాలు చేస్తారు. దూరపు బంధువుల ఆగమనం కొంత ఆనందం కలిగిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. దూర ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది.

సింహం: వ్యాపార ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. వ్యయ ప్రయాసలతో గాని పనులు పూర్తి కావు. చేపట్టిన పనులు వాయిదా పడతాయి. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. కుటుంబ సభ్యులతో చిన్నపాటి విభేదాలు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది.

కన్య: ఉద్యోగాలలో మరింత అనుకూల పరిస్థితులు ఉంటాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. గౌరవ మర్యాదలకు లోటుండదు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

తుల: ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి శుభవార్తలు అందుతాయి. బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. అధికారులతో చర్చలు సఫలం అవుతాయి.

వృశ్చికం: బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టే విషయంలో పునరాలోచన చేయడం మంచిది.

ధనస్సు: మాతృ వర్గ బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి కావు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. ఇంటాబయట ఊహించని సమస్యలు చోటుచేసుకుంటాయి. వాహన ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం.

మకరం: సోదరుల నుండి ధన సహాయం అందుతుంది. నూతన మిత్రులు పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. శుభకార్యాలకు ధనవ్యయం చేస్తారు. భాగస్వామి వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సంతానం పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు.

కుంభం: వృత్తి ఉద్యోగాలలో ఇతరుల నుండి విమర్శలు అధికమవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు మందగిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణయత్నాలు చేస్తారు. దూరప్రయాణ సూచనలు ఉన్నవి.

మీనం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. కీలక సమయంలో సన్నిహితుల సలహాలు కలిసివస్తాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.



# గోదావరి పుష్కరాలకు నిధులివ్వండి



మొదటి పేజీ తరువాయి

సహాయం అందించాలని కోరారు. పోలవరం తాజా నివేదికతో పాటు రాష్ట్రంలోని పలు సాగునీటి ప్రాజెక్టుల అంశాలను కూడా ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం లోటు, వ్యవసాయ రంగంపై దాని ప్రభావాన్ని చంద్రబాబు వివరించారు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేం దుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వెల్లడించారు. మదనపల్లె గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుతో పాటు అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు, విశాఖ మెట్రో, బీచ్ రోడ్డు వంటి మౌలి క సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర సహకా రం కోరారు.ప్రధాని మోదీతో భేటీకి ముందు చంద్రబాబు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, సీఆర్ పాటిల్ లతో వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల పనులు, పోలవరం ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే స్వర్ణాంధ్ర--2047 విజన్‌పై కూడా ప్రధానికి వివరించిన చంద్రబాబు.. రాష్ట్రానికి కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని కోరారు.



# బీసీ గర్జనకు వైసీపీ సై

మొదటి పేజీ తరువాయి

రాబోయే రాజకీయ సమీకరణాలకు వేదికా? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీసీ నినాదాన్ని బలంగా వినిపించడం వెనుక రాజకీయ లెక్కలు లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాంధ్రలో బీసీ ఓటర్లు కీలకంగా ఉన్న నేపథ్యంలో.. ఆ వర్గాలను మరోసారి తమవైపు తిప్పుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు చేసిన కార్యక్రమాలను ప్రస్తావించడంతో పాటు.. ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలను ఎజెండాగా మార్చుకునే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల రిజర్వేషన్ల అంశం వైసీపీకి ప్రధాన రాజకీయ ఆయుధంగా మారే అవకాశముంది. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం తగ్గుతోందని, రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపణలు చేయాలని ఆ పార్టీ భావిస్తోంది. అదే సమయంలో బీసీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అన్యాయాల అంశాలను కూడా సభలో ప్రస్తావించే అవకాశం ఉంది. అంటే.. బీసీ సమస్యలను రాజకీయంగా మరింత పదునైన అంశంగా మార్చడమే వైసీపీ లక్ష్యంగా కనిపిస్తోంది.

అయితే ఇక్కడ మరో అంశం కూడా తెరపైకి వస్తోంది. ఇన్నాళ్లు పెద్దగా కనిపించని బీసీ గర్జన.. ఇప్పుడు స్థానిక ఎన్నికల ముందు ఎందుకు? ఎన్నికలకు ముందు భారీ సభ నిర్వహించడం ద్వారా బీసీ వర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడమేనా? లేక వైసీపీకి దూరమైన బీసీ ఓటు బ్యాంకును తిరిగి సమీకరించడమేనా? ఉత్తరాంధ్రలో పార్టీ బలహీనపడిందనే విమర్శలకు సమాధానంగా ఈ సభను ఉపయోగించుకోవాలనే వ్యూహం కూడా ఉండొచ్చన్న చర్చ జరుగుతోంది.

అయితే సభలో నినాదాలు చేయడం ఒకటైతే.. బీసీలకు భవిష్యత్‌లో ఏం చేస్తామన్నది చెప్పడం మరో అంశం. రిజర్వేషన్లపై స్పష్టమైన కార్యాచరణ ఏంటి? బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఎలా పెంచుతారు? స్థానిక సంస్థల్లో బీసీలకు ఏ విధమైన హక్కులు కల్పిస్తారు? అనే ప్రశ్నలకు వైసీపీ ఏం సమాధానం చెబుతుందన్నదే కీలకం. కేవలం ప్రభుత్వ వ్యతిరేకతతో సభను నడిపిస్తారా.. లేక బీసీల కోసం కొత్త రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తారా అన్నది చూడాలి.

మొత్తానికి ఉత్తరాంధ్ర బీసీ గర్జన వైసీపీకి కేవలం ఒక సభ కాకుండా.. రాజకీయ పునరాగమనానికి పరీక్షగా మారే అవకాశం ఉంది. బీసీ కార్డుతో ఉత్తరాంధ్రలో పాత బలం తిరిగి సాధించగలదా? స్థానిక ఎన్నికల ముందు బీసీ ఓటర్లను ఏ మేరకు సమీకరించగలదా? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. సభ ముగిసిన తర్వాత వచ్చే రాజకీయ ప్రకటనలు, కార్యాచరణను బట్టి వైసీపీ వ్యూహం ఎంత లోతుగా ఉందో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# జనసేనకు 5 మేయర్ సీట్లు?

మొదటి పేజీ తరువాయి

ఉంది.. ఇప్పటివరకు దీనిపై అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. తాజాగా టీడీపీ--జనసేన మధ్య స్థానిక ఎన్నికల సీట్ల పంపకంపై చర్చలు జరుగుతున్నట్లు, జనసేనకు కావాల్సిన స్థానాల జాబితాను పవన్ కల్యాణ్ చంద్రబాబుకు అందించినట్లు రాజకీయ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

ఇక జనసేన కోరుతున్న మేయర్ స్థానాలపై వస్తున్న ప్రచారంలో కాకినాడ, విజయవాడ, ఒంగోలు, తిరుపతి వంటి నగరాలు కీలకంగా కనిపిస్తున్నాయి. మచిలీపట్నం విషయంలో కూడా జనసేనకు అవకాశం ఉండొచ్చనే చర్చ సాగుతోంది. ఇప్పటికే జనసేన ప్రాథమిక కసరత్తులో ఏలూరు, కాకినాడ, విజయవాడ, ఒంగోలు, తిరుపతి వంటి కార్పొరేషన్లపై ఆసక్తి చూపినట్లు సమాచారం. మరోవైపు టీడీపీ--జనసేన--బీజేపీ మధ్య తుది పంపకం ఇంకా ఖరారు కాలేదని కూటమి నేతలు అంటున్నారు.

అసలు విజయవాడ మేయర్ సీటు మాత్రం కూటమిలో కీలక పోటీగా మారే అవకాశం కనిపిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో 2024లో జనసేనకు అసెంబ్లీ ప్రాతినిధ్యం దక్కకపోవడంతో.. స్థానిక ఎన్నికల్లో విజయవాడ మేయర్ స్థానం ద్వారా తమ బలం పెంచుకోవాలని ఆ పార్టీ భావిస్తోందనే ప్రచారం జరుగుతుంది. అదే సమయంలో టీడీపీలోనూ మేయర్ పదవిపై ఆశావహులు చాలామందే ఉన్నారు. దీంతో విజయవాడ విషయంలో టీడీపీ--జనసేన మధ్య సీట్ల సర్దుబాటు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇక ఈసారి మేయర్ ఎన్నిక విషయంలో మరో కీలక మార్పు వచ్చింది. మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లను ప్రజలు నేరుగా ఎన్నుకునే విధంగా ప్రభుత్వం నిబంధనలు జారీ చేసింది. అంటే మేయర్ అభ్యర్థి ఎంపికే పార్టీలకు అత్యంత కీలకం కానుంది. రిజర్వేషన్లు, స్థానిక రాజకీయ సమీకరణాలు, పార్టీ బలం, అభ్యర్థి ఇమేజ్.. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది పంపకం జరిగే అవకాశం ఉంది. మొత్తానికి జనసేనకు ఐదు మేయర్ స్థానాలు ఫిక్స్ అన్న ప్రచారం కూటమి రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతోంది. కానీ అధికారికంగా మాత్రం ఇంకా ఏ పార్టీకి ఏ మేయర్ సీటు ఖరారైందనే ప్రకటన రాలేదు. సీట్ల పంపకంపై చంద్రబాబు-పవన్ మధ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో.. జనసేన అడిగిన సీట్లు ఎన్ని? టీడీపీ ఎన్ని సీట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది..? బీజేపీ లెక్క ఏంటి? చివరకు కాకినాడ నుంచి తిరుపతి వరకు ఈ ఐదు సీట్లు జనసేన ఖాతాలో పడతాయా? అన్నది తుది సమన్వయంపై ఆధారపడి ఉంది.

# బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్‌ఈసీ తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరి 5 నాటికి సిద్ధమైన ఫొటో ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు పేర్కొంది. స్థానిక సంస్థల వారీగా అవసరమైన బ్యాలెట్ బాక్సులను ఇప్పటికే సిద్ధం చేసినట్లు, బ్యాలెట్ పేపర్ల ముద్రణకు త్వరలో ప్రింటింగ్ ప్రెస్‌ను ఖరారు చేయనున్నట్లు పునేఠా తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉన్నారని ఎస్‌ఈసీ స్పష్టం చేసింది. అన్ని ప్రాంతాల్లో ఒకేసారి కాకుండా పరిస్థితులకు అనుగుణంగా విడతలవారీగా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# జగన్ హిందువుగా మారాలి

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ.. విజయవాడ, విశాఖపట్నం, అనంతపురంలో ఇప్పటికే 15 ప్రతిపాదనలు ప్రకటించామని, తిరుపతిలో మరో ఐదు ప్రతిపాదనలు చేస్తున్నట్లు వెల్లడించారు. కులం, మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకూడదని, నిర్మాణాత్మక విమర్శలతో ముందుకు వెళ్తామని చెప్పారు.

ఈ సందర్భంగా హిందూ ధర్మం, మతమార్పిడులు, టీటీడీ అంశాలపై విజయసాయి రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హిందూ దళితులను ఆలయాల్లోకి అనుమతించకపోతే కఠిన శిక్షలు విధించేలా చట్టం తీసుకురావాలని ప్రతిపాదించారు. జగన్ మతాన్ని రాజకీయాలకు ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తూ.. ఆయన హిందూ మతంలోకి వస్తే స్వాగతిస్తామని వ్యాఖ్యానించారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని, చర్చిలు, మసీదులకు కూడా వెళ్తానని తెలిపారు. జగన్ కుల, మతాల విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని విమర్శించారు.

తిరుపతికి సంబంధించి మద్యపాన నిషేధం, ప్రపంచ హిందూ ధార్మిక సంస్థ ఏర్పాటు, టీటీడీ బోర్డులో రాజకీయ నాయకులకు అవకాశం లేకుండా చేయడం, మఠాధిపతులు- పీఠాధిపతులకు ప్రాధాన్యం కల్పించడం వంటి ప్రతిపాదనలు చేశారు. తిరుమల భద్రతను కేంద్రానికి అప్పగించాలని, వెంకటేశ్వర పాఠశాలలు ఏర్పాటు చేసి ఉచిత విద్య అందించాలని సూచించారు. లడ్డూ ప్రసాదం, నెయ్యి కొనుగోళ్ల వ్యవహారంపైనా చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిపారంటూ నాడు చంద్రబాబు ఆరోపించారని విజయసాయి రెడ్డి అన్నారు. ఆ తర్వాత జరిగిన విచారణలో అలాంటిది ఏమీ లేదని తేలిందని తెలిపారు. ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి ఆ విధంగా మాట్లాడి ఉండకూడదని అన్నారు.

# ఈసీ నియామకాలపై సుప్రీంకోర్టులో పిటిషన్

### ఎన్నికల కమిషన్ నియామకాలపై న్యాయపోరాటం

ఢిల్లీ:చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి నియామకాలను సవాల్ చేస్తూ గురువారం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సూరి పయల ఆర్టికల్ 32 కింద పిటిషన్ దాఖలు చేశారు. ముగ్గురు ఏ అధికారంతో పదవుల్లో కొనసాగుతున్నారో వివరించాలని, నియామకాలు చట్టబద్ధంగా లేకుంటే పదవులు ఖాళీగా ప్రకటించాలని కో వారెంటో రిట్ కోరారు. 2024లో ఈసీలుగా, 2025లో జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీగా, వివేక్ జోషిని ఈసీగా నియమిస్తూ జారీ చేసిన నోటిఫికేషన్లను పిటిషన్‌లో సవాల్ చేశారు. 2023 ఎన్నికల కమిషనర్ల చట్టంలోని నిబంధనలను సరిగ్గా పాటించకుండానే నియామకాలు చేపట్టారని పిటిషనర్ ఆరోపించారు.

# శ్వేత సంపాదకీయం

**గురువారం 8-10-2026**

## నోబెల్ పై ట్రంప్ ఆశలు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నోబెల్ బహుమతి ఈ సారి ఎవరిని వరించనుంది? ఈ శాంతి బహుమతి కోసం పలువురి మధ్య కీలక పోటీ నెలకొంది. ముఖ్యంగా ప్రపంచ శాంతి, మానవతా సంక్షోభాలపై నిరంతరం దౌత్యపరమైన పిలుపునిస్తున్న పోప్ లియోతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్స్కీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, నార్డిక్ ప్రజాప్రతినిధులు లీసా మౌర్కోవ్స్కీ, అజా చెమినిట్జ్‌లు నామినేట్ అయినవారిలో ఉన్నారు. రష్యా దండయాత్రకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని, శాంతిని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలకు గానూ ఉక్రెయిన్ అధ్యక్షుడు పేరు గత కొన్నాళ్లుగా నామినేట్ అవుతోంది. అయితే ఈ ఏడాది నోబెల్ బహుమతుల ప్రకటన కొనసాగుతోంది. ఇప్పటికే మెడిసిన్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో పాటు సాహిత్యంలో విజేతలను ప్రకటించారు. అయితే, శాంతి బహుమతిపై యావత్తు ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. శుక్రవారం (అక్టోబరు 8న) విజేతను ప్రకటించనున్నారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం 208 మంది, 79 సంస్థలు సహా 287 నామినేషన్లు నమోదయ్యాయి. నోబెల్ కమిటీ నియమాల ప్రకారం అధికారిక నామినేషన్ల జాబితా 50 ఏళ్ల వరకు అత్యంత గోప్యంగా ఉంచుతారు. అయితే, నామినేట్ చేసిన వ్యక్తులు లేదా సంస్థల బహిరంగ ప్రకటనలు, అంతర్జాతీయ మీడియా కథనాలు, నిపుణుల విశ్లేషణల ఆధారంగా ఈ రేసులో ప్రముఖంగా పలు పేర్లు వినిపిస్తున్నాయి. వీటిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు కూడా ఉన్నట్టు వెల్లడయ్యింది.నోబెల్ బహుమతి కోసం కొన్నేళ్లుగా విశ్వప్రయత్నాలు చేస్తున్న ట్రంప్.. బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ తన మొదటి పదవీకాలం నుంచే నోబెల్ కల కంటున్నారు. అనేక యుద్ధాలను ఆపిన తానే అసలైన శాంతిదూతను అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య అబ్రహమ్ అకార్డ్‌తో చారిత్రక దౌత్య సంబంధాలు కుదిర్చినందుకు శాంతి బహుమతి పలుమార్లు నామినేట్ చేశారు. నార్వే పార్లమెంట్ సభ్యులు, అమెరికా కాంగ్రెస్‌లోని రిపబ్లికన్ ప్రతినిధులు, పాకిస్థాన్ వంటి దేశాలకు చెందిన నాయకులు అనేక సందర్భాల్లో ట్రంప్ పేరును అధికారికంగా ప్రతిపాదించారు. ఈ ఏడాది కూడా శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో 'అయినా నాకు ఇవ్వరు లే' అంటూ నోబెల్ కమిటీపై బాహటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

'ఎన్నో యుద్ధాలను ఆపానని, ఈ పురస్కారం నాకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ట్రంప్.. నా కృషికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదు' అంటూ రసరసలాడుతున్నారు. ఇటీవల నోబెల్ బహుమతుల ప్రకటనకు ముందు కూడా " నేను ఎనిమిది యుద్ధాలను ఆపాను.. నోబెల్ కమిటీ నాకు ఇవ్వకపోతే వారికే అవమానం" అని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడైన కొద్ది నెలలకే బరాక్ ఒబామాకు నోబెల్ రావడంపై కూడా పలుసార్లు తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌కు చెందిన ప్యాడ్‌మాన్‌గా గుర్తింపు పొందిన అరుణాచలం మురుగనాథన్ కూడా నామినేట్ అయ్యారు. మహిళల రుతుక్రమ పరిశుభ్రతపై అద్భుతమైన సామాజిక విప్లవాన్ని తెచ్చినందుకు, ఆయన చేసిన కృషికి గానూ బహిరంగంగా నామినేట్ అయినట్టు నివేదికలు పేర్కొన్నాయి. ప్రపంచ వివాదాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, యుద్ధ నేరాలపై చట్టపరమైన జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి కృషిచేసిన అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేరాల కోర్టు , భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అనేక దేశాలు శాంతియుతంగా అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నందుకు ప్రతీకగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం పేరు కూడా నామినేట్ అయ్యింది. మరోవైపు నోబెల్ శాంతి బహుమతికి తానే పూర్తిగా అర్హుడినని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. ఇప్పటివరకు ఏ అమెరికా అధ్యక్షుడూ చేయని విధంగా ప్రపంచ శాంతి కోసం తాను విశేష కృషి చేశానని, ఏకంగా ఎనిమిది యుద్ధాలను ఆపానని ఆయన పాతపాటే పాడారు. నార్వేజియన్ పీస్ కమిటీ శుక్రవారం ఈ అవార్డులను ప్రకటించనున్న నేపథ్యంలో శ్వేతసౌధంలో మీడియాతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

తనకు నోబెల్ పురస్కారం ఇవ్వకపోతే, అది ఆ కమిటీకే పెద్ద అవమానమని ఆయన అన్నారు. 2009లో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు నోబెల్ బహుమతి ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆయనకే తెలియదంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. గత ఏడాది నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, మారియా కొరినా మచాడో ఆ అవార్డుకు తనకంటే ట్రంపే ఎక్కువ అర్హుడని చెబుతూ ఆమె బహుమతిని తనకు అందించారని గుర్తుచేశారు. వివిధ దేశాలపై వాణిజ్య సుంకాలను అస్త్రంగా ఉపయోగించి, అనేక యుద్ధాలు జరగకుండా అడ్డుకోగలిగానని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికా– ఇరాన్ ఉద్రిక్తతలను కూడా త్వరలోనే పరిష్కరిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తానెన్నో యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి తన కంటే అర్హులెవరూ లేరంటూ గతంలో కూడా చాలాసార్లు ట్రంప్? పేర్కొన్నారు. నోబెల్ కమిటీని ఉద్దేశిస్తూ, వారి నిర్ణయం ఏంటో తమకు తెలియదని, తనలాంటి వారికి ఈ పురస్కారం ఇవ్వకపోవడమే వారికి అలవాటుగా కనిపిస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇంతకుముందు ఎవరూ చేయలేని పనులు నేను చేశా. నేను గొప్పలు చెప్పుకోవడం లేదు. కేవలం వాస్తవాలు మాత్రమే చెబుతున్నా. బహుశా ఏ అధ్యక్షుడు కూడా ఇన్ని యుద్ధాలను పరిష్కరించి ఉండకపోవచ్చు. కానీ నేను మాత్రం ఒకటి రెండు కాదు, ఏకంగా 8 యుద్ధాలు ఆపాను. కాబట్టి నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు నేను అర్హుడిని. కానీ అది నాకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువే. ఒకవేళ నాకు నోబెల్? ఇవ్వకపోతే అది కమిటీకి పెద్ద అవమానం అవుతుందని అన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది నామినేషన్లలో ట్రంప్ పేరు ఉండొచ్చని గతంలోనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం ఎవరిని వరిస్తుందన్న విషయంపై ఉత్కంఠ నెలకొంది. ఏది ఏమైనా అన్నివిధాల అర్హుడికే ఈ నోబెల్ శాంతి బహుమతి దక్కాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

### ఎమ్మెల్యే బిఎల్ఆర్ దిశా నిర్దేశం...



కాప్రా అక్టోబర్ 8: రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాప్రా మున్సిపల్ ఆఫీస్ (కాప్రా సర్కిల్ ఆఫీస్)లో డీసీ నిత్యానంద ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యమైన సన్నాహక సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. డిప్యూటీ కమిషనర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాచారం డివిజన్ కి చెందిన అన్ని స్థాయిల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు మరియు పార్టీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన సన్నాహకాలు, క్షేత్రస్థాయి సమన్వయం, ఓటర్లతో సంప్రదింపులు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై నాయకులతో చర్చించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, వారి సమస్యలు మరియు అభిప్రాయాలను తెలుసుకుని సంబంధిత అంశాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో అన్ని స్థాయిల పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.



## టీచర్‌గా మారిన ఏలూరు కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు/దెందులూరు, అక్టోబర్, 8 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యా బోధన అందిస్తున్నామని, అందుకు తగిన విధంగా విద్యార్థులు కష్టంతో కాక ఇష్టంతో విద్య నభ్యసించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విద్యార్థులకు ఉద్బోధించారు. దెందులూరు మండలం సింగవరంలోని శ్రీ మావులేటి సోమరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన , విద్యార్థుల ప్రతిభ స్థాయిలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యాభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నదన్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలూ, యూనిఫామ్, బూట్లు, స్కూల్ బ్యాగ్ లు వంటివి ఉచితంగా అందిస్తూ, మధ్యాహ్న భోజనం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ క్లాస్ రూంలు, క్రీడా మైదానాలు, ల్యాబ్ లు, వంటి మౌలిక సదుపాయాలు అన్నీ ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన టీచర్స్ విద్యా బోధనా చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అందిస్తున్న చేయూతతో విద్యార్థులు విద్యపై దృష్టి కేంద్రీకరించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి పెరిగిందన్నారు. ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయులు నిర్దేశించిన సమయానికి పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు.

కలెక్టర్ వెంట ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ సుమతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రావు గారి విజయ గాథ నేటి యువతకు ఆదర్శం

హైదరాబాద్, అక్టోబర్ 8: ఆసక్తి, అభిరుచికి తోడు కృషి, పట్టుదల కలిస్తే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన ధీరుడు మన ఎం.ఎన్. రావు గారు. సరియైన సదుపాయాలు లేని ఆ రోజుల్లో స్వయంకృషితో పైకి ఎదిగిన రావు గారు నేడు వందలాది మందికి ప్రత్యక్షంగా, కొన్ని వేల మందికి పరోక్షంగా ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. దేశం నాకు ఏమిచ్చింది అని ఆలోచించకుండా దేశానికి, మానవ సమాజానికి తన శైలిలో సేవలందించిన రావు గారి విజయ గాథ నేటి యువతకు ఆదర్శం. కృష్ణాజిల్లా జగ్గారావుపేట గ్రామానికి చెందిన ఎం.ఎన్.రావు తాత, తండ్రులది వ్యాపార కుటుంబం. చిన్నప్పటి నుంచి చదువులో చురుకైనవాడు కావడంతో పాటు మేనమామ తరపు వారు ప్రోత్సహించడం మూలంగా ఆయన తన విద్యాభ్యాసాన్ని నిరాఘాటంగా కొనసాగించారు. 1959 ఆగస్టు 10న జన్మించిన డాక్టర్ ఎం.ఎన్.రావు గారు జి.వి.జె జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి. 1974 పదవ తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథముడిగా, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణులయ్యారు. శ్రీమతి పెండ్యాల శకుంతలమ్మ కాలేజీలో విశ్వేశ్వరయ్య స్కాలర్షిప్ తో 1976లో ఇంటర్ ఎంపీసీ పూర్తి చేశారు. 1976లో బీఫార్మసీ 1981లో ఫార్మసిటికల్ టెక్నాలజీ లో ఎం ఫార్మా పూర్తి చేశారు. 1987లో ఐ.ఎమ్.ఎమ్ బెంగళూరు నుండి ఐటీ మార్కెటింగ్ హెల్త్ మేనేజ్మెంట్ లలో పి.హెచ్.డి పూర్తి చేసి డాక్టరేట్ సాధించారు. 'డెవలప్మెంట్ ఆఫ్ కంప్యూటర్ ఎం.ఐ.ఎస్ ఫర్ స్మాల్ హాస్పిటల్స్' అనే అంశంపై వీరి పరిశోధన పత్రాలు సమర్పించారు. ఆలింబిక్ కెమికల్స్(ఫార్మా) బరోడాతో పాటు ఆలేర్గాన్, ఎస్.కే.ఎఫ్, షేవర్ వంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థలలో తన ఉద్యోగ ప్రస్థానాన్ని కొనసాగించి, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన డాక్టర్ ఎం.ఎన్.రావు ఫార్మా రంగంలో తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా జెనెటిక్ బ్రీడింగ్ విషయంలో నరసాపూర్, మెదక్, కౌడిపల్లిలలో ఉన్న పౌల్ట్రీలలో కెనడా శాస్త్రవేత్తలతో కలిసి చేసిన పరిశోధనలు మంచి ఫలితాలను ఇచ్చాయి. సార్క్ దేశాలతో పాటు గల్ఫ్, ఫ్రాన్స్ వంటి దేశాలతో కలిసి 1994 నుండి 1997 వరకు క్లినికల్ ట్రయల్స్ లో తన వంతు పాత్రను సమర్థవంతంగా పోషించారు. అప్పటికి ఆయన వయసు కేవలం 34 సంవత్సరాలు మాత్రమే కావడం గమనార్హం. ప్రస్తుతం చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేజు–2లో గోల్డెన్ స్టిక్ పేరిట స్థాపించిన సంస్థ ద్వారా ప్రపంచ జనావళికి తన వంతు సేవలందిస్తున్నారు. నిరుడు పాతికేళ్ల ఉత్సవాలను జరుపుకున్న ఈ సంస్థ ఋతువుల మార్పు కారణంగా పక్షుల్లో, ముఖ్యంగా కోళ్లలో వచ్చే వివిధ వ్యాధుల నివారణకు అవసరమైన మందులను తయారు చేస్తోంది.





# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

**పేదలకు శాశ్వత హక్కులు**

**దీూజ ద్వారా రూ.2.50 లక్షల సాయం**

**26 నెలల్లో రూ.9 కోట్ల CMRF సాయం**

**ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం:బొండా**

విజయవాడ: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఎనిమిది మంది లబ్ధిదారులకు్రాహీా 2.0 (దీూజ) పథకం కింద రూ.40 లక్షల విలువైన లబ్ధి పత్రాలతో పాటు జవీ=ఖీ చెక్కులను ఆయన అందజేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు +.ా.30 ద్వారా శాశ్వత హక్కులు కల్పిస్తున్నామని బొండా ఉమా తెలిపారు. 50 నుంచి 150 గజాల లోపు స్థలాల్లో నివసిస్తున్న పేదలు ఇళ్లను నిర్మించుకునేందుకు లేదా పునర్నిర్మించుకునేందుకు దీూజ పథకం ద్వారా రూ.2.50 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. గత 26 నెలల్లో సెంట్రల్ నియోజకవర్గంలో CMRF ద్వారా దాదాపు రూ.9 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కులం, మతం, పార్టీ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తల సహకారంతో ముందుకు సాగుతున్నామని బొండా ఉమా తెలిపారు.



# టీడీపీ గూటికి 300 మంది

**సాయి సంజయ్ వెంట 300 మంది.. బొండా ఉమా సమక్షంలో చేరిక**

విజయవాడ: పాయకపురంలోని ఎంఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో వ్యాపారవేత్త సాయి సంజయ్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ యువ నాయకుడు బొండా సిద్ధార్థ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కొత్తగా చేరిన వారికి బొండా ఉమా పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. చంద్రబాబు నాయకత్వం, టీడీపీ విధానాలపై విశ్వాసంతో పెద్ద సంఖ్యలో చేరికలు జరగడం పార్టీ బలోపేతానికి సంకేతమని బొండా ఉమా అన్నారు.

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కార్యకర్తలు వారధిగా



పనిచేయాలని అన్నారు. పార్టీలో కొత్తగా చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు కల్పిస్తూ పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామని బొండా ఉమా తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నూతనంగా పార్టీలో చేరిన వారు పాల్గొన్నారు.

# ఆ క్రెడిట్ నాదే

**డిజిటల్ దూకుడులో భారత్ నంబర్ వన్**

**ఏపీని టెక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం: చంద్రబాబు**

**సీఐఐపై మొదటి హక్కులు నాకే ఉంటాయి:సీఎం**

ఢిల్లీ: డిజిటల్ మౌలిక సదుపాయాల్లో భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్‌గా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. గురువారం ఢిల్లీలో సీఐఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. భారత్‌కు సింగిల్ పవర్ గ్రిడ్ ఉందని, రోడ్ గ్రిడ్‌లో రెండో స్థానంలో ఉన్నామని తెలిపారు. నవంబర్‌లో విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు సన్నాహకంగా ఈ సమావేశం నిర్వహించారు. సీఐఐతో తనకు మూడు దశాబ్దాల అనుబంధం ఉందని చంద్రబాబు గుర్తుచేశారు.

1895లో సీఐఐ కోల్‌కతాలో ఏర్పాటైంది. 1996 ప్రాంతంలో నేను సీఐఐని ప్రమోట్ చేశానన్నారు. 1990లో వచ్చిన ఐటీ విప్లవాన్ని తాను అందిపుచ్చుకున్నానని... ఐటీ కేంద్రంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేశానని చెప్పారు. తాను తీసుకున్న చర్యల వల్ల ఇప్పుడు తెలంగాణ తలసరి ఆదాయంలో నంబర్1గా ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారామని... ఇప్పుడు పెట్టుబడిదారులు అనుమతి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదు. అంతా ఆన్‌లైన్‌లోనే. రియల్ టైమ్‌లో




పరిష్కరించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఏపీలో డిజిటల్ హబ్‌లు, డేటా సెంటర్లు, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవలే రాయలసీమ ప్రాంతంలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును ప్రారంభించామని చెప్పుకొచ్చారు.

రాష్ట్ర సముద్ర తీరాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రతి 50 కిలోమీటర్లకు పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, పుట్టపర్తిలో డిఫెన్స్, ఏరోస్పేస్ ప్రాజెక్టులతో పాటు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం ఇస్తున్నామని చెప్పారు. ఏఐ, రియల్‌టైమ్ గవర్నెన్స్‌తో సేవలను వేగవంతం చేస్తున్నామని, అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో గ్లోబల్ టెక్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.




# ఈసీకి మాజీ జడ్జీల అండ

**ఈసీకి 42 మంది మాజీ జడ్జీల మద్దతు**

**విపక్షాల ఆందోళనల వేళ బహిరంగ లేఖ**

ఢిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ (ా×=) ప్రక్రియను రద్దు చేయాలని విపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘానికి 42 మంది మాజీ న్యాయమూర్తులు మద్దతుగా నిలిచారు. ఈ మేరకు వారు బహిరంగ లేఖ విడుదల చేస్తూ.. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ సహా రాజ్యాంగబద్ధ సంస్థల ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు.రాజ్యాంగబద్ధ సంస్థలపై నిరంతర దాడులు జరుగుతున్నాయని మాజీ న్యాయమూర్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థల పనితీరును విమర్శించడం ప్రజాస్వామ్య హక్కేనని, అయితే వాటిని కించపరిచేలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళనకరంగా ఉన్నాయని, ఎన్నికల సంఘంపై ఓటు చోరీ వంటి ఆరోపణలు సరైన ఆధారాలు లేకుండా చేయడాన్ని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధ సంస్థల అధినేతలను దూషించడం, వారిపై తప్పుడు ముద్ర వేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని మాజీ న్యాయమూర్తులు హెచ్చరించారు. సంస్థల స్వతంత్రత, ప్రతిష్ఠను కాపాడేందుకు రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు కోరారు.

# విజయవాడ ఉత్సవ్ 2.0కు జాతీయ హంగులు

**విజయవాడ ఉత్సవ్ 2.0కు జాతీయ ప్రచారం**

**ఉపరాష్ట్రపతి, అమిత్ షాకు ఆహ్వానం**

**జాతీయ స్థాయిలో విజయవాడ ఉత్సవ్ 2.0**

విజయవాడ: విజయవాడలో ఘనంగా నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0కు జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించేలా కార్యక్రమ నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎంపీలు పలువురు ప్రముఖులను కలిసి ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నారు. గురువారం ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను ఎంపీలు కేశినేని చిన్ని, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎంపీ భరత్ కలిసి విజయవాడ ఉత్సవాలకు ఆహ్వానించారు. విజయవాడలో జరిగే దసరా శరన్నవరాత్రి వేడుకల వైభవంతో పాటు విజయవాడ ఉత్సవ్ 2.0 ప్రత్యేకతలను ఆయనకు వివరించారు. అదేవిధంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఎంపీలు లావు కృష్ణదేవరాయలు, సానా సతీష్, బైరెడ్డి శబరి కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0లో నిర్వహించనున్న కార్యక్రమాలు, ప్రత్యేకతలను కేంద్ర హోంమంత్రికి వివరించారు. జాతీయ స్థాయి ప్రముఖులను ఆహ్వానించడం ద్వారా విజయవాడ ఉత్సవ్ 2.0కు మరింత విస్తృత ప్రచారం కల్పించే ప్రయత్నం జరుగుతోంది. దీంతో ఈసారి విజయవాడ దసరా వేడుకలు, ఉత్సవ్ 2.0పై జాతీయ స్థాయిలోనూ దృష్టి సారించేలా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.





# కెనడా రచయిత్రికి నోబెల్

**సమకాలీన సాహిత్యంలో కొత్త రూపాలు సృష్టి**

**కెనడా రచయిత్రి ఆన్ కార్సన్‌కు నోబెల్ పురస్కారం**

స్టాక్‌హోమ్: కెనడాకు చెందిన ప్రముఖ రచయిత్రి, కవయిత్రి ఆన్ కార్సన్‌కు 2026 సాహిత్య నోబెల్ బహుమతి లభించింది. క్లాసికల్ సంప్రదాయాన్ని సమకాలీన సాహిత్యంతో మేళవిస్తూ వినూత్న రచనా రూపాలను సృష్టించినందుకు ఈ పురస్కారం దక్కినట్లు స్వీడిష్ అకాడమీ ప్రకటించింది. ఎరోస్ ది బిట్టర్ స్వీట్, ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్ వంటి రచనలతో ఆమె ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు




పొందారు. 1950లో టొరంటోలో జన్మించిన కార్సన్ ప్రాచీన గ్రీకు సాహిత్యంపై ప్రత్యేక ఆసక్తి పెంచుకున్నారు. క్లాసిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన ఆమె.. కవయిత్రిగా, అనువాదకురాలిగా, వ్యాసకర్తగా, అధ్యాపకురాలిగా రాణించారు. గ్రీకు పురాణాలు, సాహిత్యాన్ని ఆధునిక మానవ భావోద్వేగాలతో మేళవించడం ఆమె రచనా ప్రత్యేకతగా నిలిచింది.

# మొబైల్.. సుపరిపాలనకు వారధి

**ప్రజల అరచేతిలో ప్రభుత్వ సేవలు**

**డీబీటీతో రూ.5 లక్షల కోట్ల ఆదా**

**దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ చేరింది**

**IMC-2026లో మోదీ కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: ఒకప్పుడు కేవలం ఫోన్ కాల్స్, సందేశాలకే పరిమితమైన మొబైల్ ఫోన్.. నేడు సుపరిపాలనకు కీలక సాధనంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల అరచేతిలోకి తీసుకురావడంలో మొబైల్ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. గురువారం జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్--2026లో మాట్లాడిన ఆయన.. దేశ డిజిటల్ ప్రయాణాన్ని వివరించారు.దేశంలో 5జీ సేవలు వేగంగా విస్తరించాయని, ప్రస్తుతం ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందని మోదీ తెలిపారు. మొబైల్ సాంకేతికతతో ప్రయాణ సమయం, నిరీక్షణ, ఖర్చులు తగ్గాయని చెప్పారు. గేమింగ్, కంటెంట్ క్రియేషన్ వంటి కొత్త రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

డిజిటల్ సేవల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వేగంగా



ప్రజలకు చేరుతున్నాయని ప్రధాని తెలిపారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ అవుతున్నాయని, దీంతో సుమారు రూ.5 లక్షల కోట్ల నిధులు తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోగలిగామని వివరించారు. సాంకేతికత కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని చివరి వ్యక్తి వరకు అందుబాటులోకి రావాలన్నారు.

అదే సమయంలో సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌ల వంటి కొత్త సవాళ్లపై అప్రమత్తత అవసరమని మోదీ సూచించారు. డీప్‌ఫేక్‌ల మూలాలను గుర్తించే వ్యవస్థలతో పాటు సైబర్ నేరాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ సవాళ్లపై ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.





# విజయవాడ ఉత్సవ్--2.0కు విస్తృత ప్రచారం

విజయవాడ: విజయవాడ ఉత్సవ్--2.0 ప్రచార ఆటోలను టీడీపీ యువ నాయకుడు బొండా సిద్ధార్థ, TNTUC రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల ద రఘురామరాజు గురువారం సింగ్‌నగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటోలకు ఉత్సవ్--2.0 పోస్టర్లను ఏర్పాటు చేశారు. బొండా సిద్ధార్థ మాట్లాడుతూ.. ఉత్సవ్‌లో నిర్వహించే సాంస్కృతిక, ప్రత్యేక కార్యక్రమాలపై నగర ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగే ప్రధాన కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యమన్నారు. నగర ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# సరస్ మేళాకు సమగ్ర ఏర్పాట్లు..

### దేశం నలుమూలల నుంచి నుంచి 600 స్టాళ్ల వరకు ఏర్పాటు.. నాణ్యవంతమైన హస్తకళా, చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

### స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యం.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఈ నెల 13వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జాతీయస్థాయి సరస్ అజీవిక మేళాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎన్ఆర్ఎల్ఎం డైరెక్టర్ డా. మోలిశ్రీ, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు సరస్ మేళాకు పున్నమి ఘాట్ వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి 600 వరకు స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని.. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఒకే వేదికపై తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. హస్తకళా ఉత్పత్తులు, చేనేత ఉత్పత్తులను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయ కళలు, గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబించే ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగర ప్రజలతో పాటు ఎన్టీఆర్ జిల్లా ప్రజలు, సందర్శకులు సరస్ మేళాను పెద్ద సంఖ్యలో సందర్శించి, వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉ త్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. గౌరవ రాష్ట్రపతితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు కూడా హాజరవుతారని పేర్కొన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దసరా ఉత్సవాలతో పాటు విజయవాడ ఉత్సవ్, సరస్ మేళా.. ఇలా మూడు కార్యక్రమాలు ఒకేసారి జరగనుండటంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు



చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గౌరవ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమష్టిగా కార్యక్రమాల విజయవంతానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు.

# ఒత్తిడిని జయిస్తే.. ఆరోగ్యం, పనితీరు మెరుగే!

### మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి అధిగమించాలి: డా. జి.సమరం

### జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యవేక్షణలో విజయవంతంగా మానసిక ఆరోగ్య కార్యక్రమాలు

మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం తెలిపారు. ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా వ్యక్తిగత సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యోగుల కోసం ఆకర్ష ఫౌండేషన్, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సైకాలజిస్ట్ డా. టి.ఎస్.రావు అధ్యక్షత వహించారు. ఉద్యోగులు ఒత్తిడిని నిర్వహించుకునే విధానంపై డా. జి.సమరం విలువైన సూచనలు చేశారు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల నిద్ర, ఆకలి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.



ప్రతిరోజూ నడక, తగినంత నిద్ర, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న మానసిక ఆరోగ్య కార్యక్రమాల్లో ఇది 20వ కార్యక్రమమని తెలిపారు. ఉద్యోగులు మానసికంగా ఉత్సాహంగా, ఆరోగ్యంగా పనిచేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు కవిత, జగదీష్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై సూచనలు అందించారు. ప్రత్యేక కౌన్సెలింగ్ లో పలువురు ఉద్యోగులు నిపుణులతో తమ వ్యక్తిగత సమస్యలను చర్చించి సలహాలు పొందారు. కార్యక్రమంలో ఆకర్ష ఫౌండేషన్ చైర్మన్ డా. శంకరరావు, కలెక్టరేట్ నోడల్ అధికారి జి.జ్యోతి, సైకాలజిస్టులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.




# స్థానిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నాం

### ఓటర్ల జాబితాలు, ఎన్నికల సామగ్రి, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ తెలిపారు.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ... జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలు, మున్సిపల్ కమిషనర్లు, జెడ్పి సీఈవోలు, డీపీవోలు,

సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్ నుంచి హాజరయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్.. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఎన్నికల ముందు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్లలో వసతులు, సిబ్బంది శిక్షణ తదితరాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు సన్నద్ధత, అవసరమైన సామగ్రి, పోలింగ్ స్టేషన్లలో అవసరమైన ప్రాథమిక వసతులు, ఎన్నికల సిబ్బంది శిక్షణను మరింత సులభతరం చేసేందుకు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ప్రి-పోలింగ్, పోలింగ్ రోజు, కౌంటింగ్, సిబ్బంది విధులు, బాధ్యతలకు సంబంధించిన మాడ్యూల్ వారీ శిక్షణ వీడియోలు, లింక్‌లను అందుబాటులో ఉంచాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీపీవో టి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా మద్యం దుకాణాలకు లాటరీ..

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రక్రియ

జిల్లాలో రెన్యువల్ కాకుండా మిగిలిన మద్యం దుకాణాలకు గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లాటరీ ప్రక్రియ (డ్రా ఆఫ్ లాట్స్) జరిగింది. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ముగిసింది. 2026-27 సంవత్సరానికిగాను ప్రభుత్వం ప్రకటించిన రెన్యువల్ విధానంలో జిల్లాలోని 124 మద్యం దుకాణాలకుగాను 106 మద్యం దుకాణాలు రెన్యువల్ అయ్యాయి. రెన్యువల్ కాని 18 మద్యం దుకాణాలకు జిల్లా కలెక్టర్ వారిచే గెజిట్ నోటిఫికేషన్ నెం.73 (తేదీ: 24.09.2026)వ తేదీన జారీచేయడం జరిగింది. నిబంధనల ప్రకారం ఒక నిర్దిష్ట దుకాణానికి కనీసం నాలుగు దరఖాస్తులు అందినప్పుడే ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. దీన్ని అనుసరించి 16 మద్యం దుకాణాలకు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. దీంతో లాటరీ ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాస్‌రావు, ఎన్టీఆర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి.రామశివ, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 38 క్షయరహిత పంచాయతీలు

### క్షయరహిత సమాజ నిర్మాణానికి సమష్టి కృషి

### సీహెచ్‌వోలకు సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

దేశవ్యాప్తంగా క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన లక్ష్యంగా



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో జోష్ (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్) కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా గురువారం ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో 38 గ్రామ పంచాయతీలను క్షయరహిత పంచాయతీలుగా గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ చేతులు మీదుగా ఎంపికైన 38 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు (సీహెచ్‌వోలు)లకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలను క్షయరహిత పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది, యువత, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, చికిత్సను పూర్తిగా అందించడం, ప్రజల్లో టీబీపై అవగాహన కల్పించడం ద్వారా జిల్లాను క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.రమేష్, జిల్లా క్షయ నివారణ అధికారి డా. బి.భానునాయక్, జిల్లా యువజన అధికారి ప్రదీప్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్, మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, జాతీయ క్షయ నివారణ కార్యక్రమం (ఎన్‌టీఈపీ) సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహం: ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు

కామవరపుకోట, అక్టోబర్ 8: ప్రతిభ చాటిన వారికి ప్రోత్సహించడం ద్వారా మరింత మెరుగ్గా రాణిస్తారని సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు పేర్కొన్నారు. ఇటీవల స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందుకున్న హాస్టల్ వార్డెన్ అంజనా, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ బొబ్బిలి డాన్ దివాకర్ లను లేడీస్ హాస్టల్ ప్రాంగణంలో సత్కరించారు. ఈ సందర్భంగా వార్డెన్ అంజన, ఎస్ఎంసి చైర్మన్ డాన్ దివాకర్ మాట్లాడుతూ సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్కరించటం మాలో మరింత బాధ్యతను పెంచుతుందని పేర్కొన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బంగారు భవిష్యత్తు కోసం చదువుకోవాలని, బాగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు, హాస్టల్ తో పాటు గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాలికలు బాడ్ టచ్, గుడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. సౌజన్ సాయి పుట్టినరోజు సందర్భంగా వంద మంది విద్యార్థులకు పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు టీవీఎస్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మున్నంగి శ్రీనివాస్, అంగన్వాడి టీచర్ రత్నమాల, ఎస్ఎంసి డైరెక్టర్లు బందెల రాజు, బందెల కిషోర్, మల్లెల్లి కాంతారావు, విద్యార్థినులు పాల్గొన్నారు

# ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల నిర్వహణ, ఆదాయ అవకాశాలను ప్రశంసించిన తెలంగాణ రైతులు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల నిర్వహణ, నమూనాలు, రైతులకు లభిస్తున్న ఆదాయ అవకాశాలను పరిశీలించిన తెలంగాణ రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి వ్యక్తం చేసిప్రశంసించారు. రైతుల విజ్ఞాన యాత్రలో భాగంగా రాష్ట్రంలో అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏ.పి.సి.ఎన్.ఎఫ్) విధానాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు తెలంగాణకు చెందిన సుమారు 50 మంది రైతుల బృందం గురువారం (08-10-26) ఎన్టీఆర్ జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది.




ఈ సందర్భంగా కంద్రపాడు గ్రామానికి చెందిన రైతు శ్రీ వెంకటప్ప రెడ్డి అభివృద్ధి చేసిన 5 అంచెల నమూనా, సమీకృత చేపల చెరువు, కూరగాయల నమూనా, బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ (బి.ఆర్.సి)లను తెలంగాణ రైతులు పరిశీలించారు. వివిధ పంటలను సమన్వయం తో సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలను తెలుసుకున్నారు. ఘనజీవామృతం, ద్రవజీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, కోడిగుడ్డు నిమ్మరస ద్రావణం, విత్తన గుళికల తయారీ విధానాలను తెలంగాణ రైతులు ప్రత్యక్షంగా పరిశీలించి, వాటి తయారీ, వినియోగంపై అవగాహన పొందారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ఇన్‌పుట్లు స్థానికంగా అందుబాటులో ఉండటం, వాటి ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను ఏపీసీఎన్ఎఫ్ అధికారులు వివరించారు.

అనంతరం వత్సవాయి మండలం పోచవరం గ్రామంలోని శ్రీ ప్రభుదాసు నిర్వహిస్తున్న ఎనీ టైం మనీ (ఏ.టి.ఎం) నమూనా, శ్రీమతి ఆదిలక్ష్మి సాగు చేస్తున్న వరి ఏ-గ్రేడ్ నమూనా, శ్రీమతి డి. రాజలక్ష్మి సాగు చేస్తున్న పత్తి ఏ-గ్రేడ్ నమూనాలను కూడా తెలంగాణ రైతులు సందర్శించారు. వివిధ పంటల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అమలు, పంటల నిర్వహణ, రైతులకు లభిస్తున్న ఆదాయ అవకాశాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రైతుల సందేహాలను సంబంధిత అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీ జి. శ్రీనివాసరావు, బోనకల్లు మండల ఏ.డి.ఏ శ్రీమతి ఐ. వాణిశ్రీ, ముదిగొండ మండల ఏ.డి.ఏ శ్రీమతి పి. వాసవి రాణి, ఏ.ఓ శ్రీ వి. నాగేశ్వరరావు, ఏ.ఈ.ఓ శ్రీ టి. రమేష్, ఏ.ఈ.ఓ శ్రీ హరికృష్ణ, ఏ.ఈ.ఓ శ్రీ హుస్సేన్, శ్రీ సతీష్ - ఎన్.ఆర్.ఓ ఎన్.ఎఫ్.ఏ పాల్గొన్నారు.



# రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ

## కలెక్టర్ వెట్రి సెల్వి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ఏలూరు/దెందులూరు, అక్టోబర్, 8: మార్చి 2027లోగా జిల్లాలోని రైతులందరికీ పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. దెందులూరు మండలం సింగవరంలో గురువారం దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ తో కలిసి పట్టాదారు పాస్ పుస్తకాలను కలెక్టర్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎటువంటి తప్పులు లేకుండా, 13 పటిష్టమైన భద్రతా ఫీచర్లతో పట్టా దారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామన్నారు. మార్చి , 2027లోగా జిల్లాలోని రైతులందరికీ పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేయాలనీ రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతీ నెల 20, నుండి 30 గ్రామాలలో రీసర్వే పనులను పూర్తిచేసి, తదుపరి నెలలో రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామన్నారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఎటువంటి తప్పులేని, రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పాస్ పుస్తకాల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతను తెలుసుకుని పట్టాదార్ పాస్ పాస్ పుస్తకాల పంపిణీని జిల్లా యంత్రాంగం నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నదన్నారు.

ఈ సందర్భంగా సింగవరం పరిధిలో రెండు ఎకరాల ప్రభుత్వము ఉందని దాన్ని కొంతమంది ఆక్రమించారని పర్వతనేని రామకృష్ణ జిల్లా కలెక్టర్ దృష్టికి తేవడంతో దాని విచారణ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు.

ఏలూరు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ సుమతి, దెందులూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గారపాటి రామసీత, సీతంపేట బ్యాంక్ అధ్యక్షుడు యలమర్తి శ్రీనివాస్,మండల అధ్యక్షుడు నాగన్న బోయిన సత్యనారాయణ, స్థానిక ప్రముఖులు పరసా వెంకట్రావు, పర్వతనేని రామకృష్ణ, బోడ్డేటి మోహన్ బాబు, ప్రభృతులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఏలూరు, అక్టోబర్, 8 : అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఈనెల 8వ తేదీ నుండి జిల్లాలో ఇంటింటికీ వెళ్లి, ఆ ఓటర్ల ప్రస్తుత స్థితిని పునఃపరిశీలిస్తారని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. 'ప్రత్యేక సమగ్ర సవరణ - 2026' (ాజూవఎఖ్శ్రీ ×త్వఅంఱజవ =వజఱంఱశీఅ)లో భాగంగా నోటీసు దశలో-ూాణణ (గైర్హాజరైన, స్థానచలనం చెందిన, మరణించిన లేదా ద్వంద్వ నమోదు కలిగిన) ఓటర్లు/అనర్హ ఓటర్ల స్థితిని పునఃపరిశీలించడం మరియు కొత్త ఓటర్లు/జాబితాలో చేరని ఓటర్ల నమోదు కోసం ఒక 'ప్రత్యేక కార్యక్రమాన్ని' (ాజూవఎఖ్శ్రీ ఐతీఱజవ) చేపట్టాలని కమిషన్ నిర్ణయించిందన్నారు.



తొలగించిన ఓటర్లను స్థితిని బిఎల్వోలు పరిశీలిస్తారని, తొలగించిన ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల్లో పరిశీలనకు ఉంచుతారన్నారు. ఈ సందర్భాలలో ఏదైనా ఓటరు పేరు పొరపాటున తొలగించబడినట్లు గుర్తిస్తే, వారికి 'ఫారం-6' నింపే అవకాశం కల్పించబడుతుందన్నారు. "అర్హులైన ప్రతి ఓటరు పేరును ఓటర్ల జాబితాలో చేర్చడం మరియు అనర్హుల పేర్లను తొలగించడం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. 'నిరంతర అప్‌డేషన్' (ఎశీఅఱఅబశీబం బజూుడ్ఱశీఅ) ప్రక్రియ ద్వారా వారి పేరు ఓటర్ల జాబితాలో చేర్చబడుతుందన్నారు. .జిల్లాలో ూ×=, 2026 (ప్రత్యేక సారాంశ సవరణ) కింద తుది ఓటర్ల జాబితా 16.10.2026న ప్రచురించబడుతుందన్నారు. ఈనెల 16వ తేదీన ప్రచురించబడే తుది జాబితాలో పేరు లేని ఓటర్లు మరియు తదుపరి అర్హత తేదీలలో అర్హత సాధించే వ్యక్తులు, 'నిరంతర అప్‌డేషన్' సమయంలో తమ పేరు నమోదు కోసం 'ఫారం-6'ను సమర్పించవచ్చన్నారు.



# పోషకాహారంపై అవగాహన కల్పించాలి ఎమ్మెల్యే రోషన్ కుమార్

కామవరపు కోట, అక్టోబర్ 8: పోషకాహారం పై గర్భిణీ స్త్రీలకు బాలింతలకు చిన్నారులకు అవగాహన కల్పించాలని చింతలపూడి ఎమ్మెల్యే రేషన్ కుమార్ సూచించారు. గురువారం కామవరపుకోటలో ఐసిడిఎస్ అధికారుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన పోషణ్ మాసం... సేవా సంకల్పం అభియాన్ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ ను ఎమ్మెల్యే పరిశీలించారు. చిరుధాన్యాలతో చేసిన ఆహారం, బాలామృతం నమూనాలను తిలకించి... నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని... తల్లులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజ అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్ చంద్ర శేషు, ఏఎంసీ మాజీ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జెడ్పిటిసి గంటా సుధీర్ బాబు, కోనేరు మోహన్, ఐసిడిఎస్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# బాలబాలికల సంరక్షణ గృహాల పరిశీలన

**అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్**

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్) కార్యదర్శి శ్రీమతి ఎ. శ్రీదేవి, ఈ రోజు సైదాబాద్‌లోని 'దివ్య జ్యోతి' బాలుర సంరక్షణ గృహం మరియు 'వైదేహి' బాలికల సంరక్షణ గృహాలను సందర్శించారు. ఈ పర్యటనలో, శ్రీమతి ఎ. శ్రీదేవి పిల్లలతో ముచ్చటించి, వారి విద్య, ఆరోగ్యం, భద్రత, ఆహారం, వసతి, దైనందిన అవసరాలు మరియు వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. సంరక్షణ గృహాలలో కల్పించిన వసతులను పరిశీలించిన అనంతరం, పిల్లలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన మరియు వారికి అనుకూలమైన (చైల్డ్-ఫ్రెండ్లీ) వాతావరణాన్ని కల్పించాలని ఆమె యాజమాన్యం మరియు సిబ్బందికి సూచించారు. పిల్లల హక్కులు మరియు వారికి అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయం, సేవల గురించి అవగాహన కల్పించాలని కూడా ఆమె ఆదేశించారు. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, సంరక్షణ మరియు భద్రత లభించేలా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఆమె నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సంరక్షణ గృహాల నిర్వాహకులు, సిబ్బంది మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# ACB వలలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

**అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్**



నిర్మల్ జిల్లా, ఖానాపూర్ రేంజ్ ఉ డివిజన్‌కు చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (ూూ) శ్రీ ఐండ్ల రవీందర్, ఫిర్యాదుదారునికి చెందిన టింబర్ డిపో లైసెన్స్ పునరుద్ధరణ కోసం తనిఖీ నివేదికను పరిశీలించి ఉన్నతాధికారులకు పంపే అధికారిక పనిని చేయడానికి రూ. 12,000 లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఆదిలాబాద్ రేంజ్-ూజదీ అధికారులకు రెడ్-హ్యాండెడ్‌గా (అడ్డంగా) పట్టుబడ్డారు. ఆరోపిత అధికారి వద్ద నుండి రూ. 12,000 లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. తద్వారా, అక్రమ ప్రయోజనం పొందేందుకు-ూూ తన విధులను అక్రమంగా మరియు నిజాయితీ లేకుండా నిర్వహించారు. అందువల్ల, అరెస్టు చేసి కరీంనగర్‌లోని గౌరవనీయులైన కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తున్నారు.

# సంగారెడ్డి 'క్షయ' నిర్మూలనకు ఉద్యమం

### క్షయ నిర్మూలనపై ఉన్నత స్థాయి సమీక్ష
### పరీక్షలు, చికిత్స వేగవంతం చేయాలని ఆదేశం
### టీబీ రహిత గ్రామాలకు ధృవీకరణ
### క్షయ కేసుల నమోదు, చికిత్స ప్రగతి
### కమ్యూనిటీ భాగస్వామ్యంతో 'జోష్' టీమ్‌లు
### క్షయ రహిత భారత్ కోసం పిలుపు



**సంగారెడ్డి ప్రతినిధి, 8 అక్టోబర్:**

సంగారెడ్డి జిల్లాలో అక్టోబర్ 8, 2026న జిల్లా అదనపు కలెక్టర్ . పాండు అధ్యక్షతన 'టీబీ ముక్త్ భారత్ అభియాన్', 'జోష్' ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించబడింది, నేషనల్ ట్యూబర్క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ (చీజ్యూ) కింద క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను వేగవంతం చేయడమే లక్ష్యం. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. లలితా దేవి, జిల్లా టీబీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సిహెచ్. అరుణా కుమారి, జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీరాజ్ అధికారి, జిల్లా యువజన అధికారి, ఎన్సీసీ యూనిట్ కమాండర్, ఇతర ఉన్నతాధికారులు, ఎంపీడీవోలు, సర్పంచ్లు పాల్గొన్నా రు. జిల్లాలో టీబీ రహిత వాతావరణాన్ని సృష్టించేందుకు క్షేత్రస్థాయిలో ముందస్తు గుర్తింపు, పరీక్షలు, చికిత్స సేవలను వేగవంతం చేయాలని పాండు పిలుపునిచ్చారు. 41 టీబీ రహిత గ్రామాలకు, మై భారత్ వాలంటీర్లు, ఎన్సీసీ విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేయబడ్డాయి. చీజ్యూ కింద ముందస్తు గుర్తింపు, సత్వర చికిత్స, నివారణ, కమ్యూనిటీ భాగ స్వామ్యంతో నిర్మూలన కార్యక్రమాలు జిల్లాలో అమలు చేస్తున్నారు. 2026 సెప్టెంబర్ వరకు 1,750 టీబీ కేసులు నమోదు కాగా, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. జిల్లాలో 7 ఫంక్షనల్ ఎక్స్-రే మెషిన్లు ఉండగా, 2026 జనవరి-సెప్టెంబర్ మధ్య 109% ఎక్స్-రే వినియోగం సాధించబడింది. 'నిక్షయ పోషణ్ యోజన' ద్వారా టీబీ రోగులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల ద్వారా ఆర్థిక సహాయం, పోషకాహార సహాయం అందిస్తున్నారు. 'టీబీ ముక్త్ భారత్ అభి యాన్' కింద 144 హై-రిస్క్ గ్రామాలను గుర్తించి, నిక్షయ్ శివిర్ క్యాంపుల ద్వారా వల్నరబుల్ జనాభాకు స్క్రీనింగ్ నిర్వహించారు. కమ్యూనిటీ భాగస్వా మ్యం, ఔట్రీచ్, ఫీల్డ్ స్థాయి కార్యకలాపాలను బలోపేతం చేయడానికి బ్లాక్ స్థాయిలో వీఆణాల నేతృత్వంలో మై భారత్ వాలంటీర్లు, ఎన్సీసీ క్యాడెట్లతో కూడిన 'జోష్' (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ టీబీ ముక్త్ భారత్ టీమ్స్) టీమ్లను ఏర్పాటు చేశారు. టీబీ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ కార్యక్రమంతో పాటు, 'టీబీ రహిత' పంచాయతీలుగా ప్రకటించడానికి నిర్దేశించిన ప్రమాణాల ఆధారంగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్/సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్నారు. క్షయ రహిత భారతదేశ నిర్మాణంలో ప్రజలు, ప్రజాప్రతి నిధులు, వివిధ శాఖల అధికారులు భాగస్వాములు కావా లని ఈ సమావేశంలో పిలుపునిచ్చారు.

# వృద్ధులు సమాజానికి 'ఆస్తి' సంగారెడ్డిలో వేడుకలు

### ప్రపంచ వృద్ధుల దినోత్సవం
### సెర్ప్ ఆధ్వర్యంలో ఉత్సవాలు
### చట్టాలు, పథకాలపై అవగాహన
### అదనపు డీఆర్డీఓ పిలుపు
### సమస్యల పట్ల భరోసా



**సంగారెడ్డి ప్రతినిధి, 8 అక్టోబర్:**

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థా-సెర్ప్ ఆధ్వర్యంలో, జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో వృద్ధ మహిళా సంఘాల సభ్యులతో ప్రపంచ వృద్ధుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు డీఆర్డీఓ సూర్య రావు, సెర్ప్ ప్రత్యేక అధికారి సురేఖ, జిల్లా వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం శాఖల, ప్రథమ్ ఎన్జీఓ ప్రతినిధులు హాజరయ్యారు. వృద్ధులకు ఉన్న చట్టాలు, సంపూర్ణ ఆరోగ్యం, కుటుంబంలో గౌరవం, వృద్ధాప్యంలో ఎదురయ్యే సమ స్యలపై అవగాహన కల్పించగా, మహిళా సభ్యులు తమ అనుభవాలు, విజయాలను పంచుకున్నారు, వృద్ధ మహిళ లను సత్కరించారు. ఈ సందర్భంగా అదనపు డీఆర్డీఓ సూర్య రావు మాట్లాడుతూ వృద్ధులు కుటుంబానికి, సమాజానికి ఆస్తి వంటివా రని, వారి అనుభవం, జ్ఞానం యువతకు మార్గదర్శకమని అభివర్ణించారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పెన్షన్ పథకాలు, ఆరోగ్య బీమా, అన్నపూర్ణ, వయో శ్రేష్ఠ యోజన వంటి పథకా లపై అవగాహన కల్పిం చి, వారి ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రతి ఒక్క రూ బాధ్యతగా ఉండా లని పిలు పునిచ్చారు. వృద్ధుల సమస్యలను తెలుసుకొని, వీఓలు, ఎస్‌హెచ్‌జీ వృద్ధ మహిళలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ సమాజం అండగా ఉంటుందని భరోసా కల్పించ ాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య ప్రతినిధులు, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, వీఓలు, జిల్లా సమాఖ్య సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# 'టీబీ' రహిత సంగారెడ్డికి సమష్టి కృషి

### సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ పిలుపు
### ముందస్తు గుర్తింపు, చికిత్స కీలకం
### 1,750 టీబీ కేసులు, 144 వల్నరబుల్ గ్రామాలు
### జోష్ బృందాలతో క్షేత్రస్థాయి బలోపేతం
### 41 టీబీ రహిత గ్రామాలకు సర్టిఫికెట్లు ప్రదానం



**సంగారెడ్డి ప్రతినిధి, 8 అక్టోబర్:**

సంగారెడ్డి, అక్టోబర్ 8: సంగారెడ్డి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఆర్. పాండు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఎన్‌సీసీ, మై భారత్ వాలంటీర్లు, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు తదితరులతో టీబీ ముక్త్ భారత్ అభియాన్, జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ టీబీ ముక్త్ భారత్ టీమ్స్ (జోష్) ఉన్నతస్థాయి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, సత్వర చికిత్స అందించడం వంటి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో టీబీ లక్షణాలు, పరీక్షలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని, టీబీ నిర్మూలన కార్యక్రమాల్లో యువతను పెద్దఎత్తున భాగస్వా ములను చేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె. లలితాదేవి మాట్లాడుతూ, నేషనల్ ట్యూబర్క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ కింద జిల్లాలో టీబీ వ్యాధి ముందస్తు గుర్తింపు, సత్వర చికిత్స, నివారణ, కమ్యూనిటీ భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. 2026 సెప్టెంబర్ వరకు జిల్లాలో 1,750 టీబీ కేసులు నమోదయ్యాయని, బాధితులకు అవసరమైన వైద్య సేవలు, నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక, పోషకాహార సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 7 ఫంక్షనల్ ఎక్స్‌రే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు నిర్దేశిత లక్ష్యంలో 109 శాతం ఎక్స్‌రే వినియోగం సాధించినట్లు ఆమె వెల్లడించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద క్షయ వ్యాధి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న 144 గ్రామాలను గుర్తించి, నిక్షయ్ శివిర్ క్యాంపుల ద్వారా వల్నరబుల్ జనాభాకు టీబీ స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కమ్యూనిటీ భాగస్వామ్యం, అవుట్‌రీచ్, క్షేత్రస్థాయి కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు బ్లాక్ స్థాయిలో ఎంపీడీవోల నేతృత్వంలో మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లతో జోష్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామ పంచాయతీలను టీబీ రహిత పంచాయతీలుగా ప్రకటించేందుకు నిర్దేశించిన ప్రమాణాల ఆధారంగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గుర్తించిన 41 టీబీ రహిత గ్రామాలకు సంబంధించిన సర్టిఫికెట్లను అదనపు కలెక్టర్ ఆర్. పాండు ఎంపీడీవోలు, సర్పంచ్‌లకు, మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టీబీ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ నిర్వహించారు, క్షయ వ్యాధి రహిత భారతదేశ నిర్మాణంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత భాగస్వాములై సమష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిబి ప్రోగ్రాం అధికారిణి సి. హెచ్. అరుణా కుమారి, జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీరాజ్ అధికారి, జిల్లా యువజన అధికారి, ఎన్‌సీసీ యూనిట్ కమాండర్, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కష్టాలు రైతన్నల రాస్తారోకో

### దౌల్తాబాద్ లో భారీ ఆందోళన
### తీవ్ర అంతరాయాలు, ఓల్టేజ్ సమస్యలు
### పంట నష్టం, ఆర్థిక భారంపై రైతుల ఆవేదన
### ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్




**సంగారెడ్డి ప్రతినిధి, 8 అక్టోబర్:**

సంగారెడ్డి జిల్లా, హత్నూర మండలం, దౌల్తాబాద్ అంబేద్కర్ తెలంగాణ చౌరస్తా వద్ద విద్యుత్ సమస్యలపై భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులు భారీ రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో తరచు అంతరాయాలు, తీవ్ర ఓల్టేజ్ సమస్యల వల్ల బోరు మోటర్లు కాలిపోవడం, మరమతులకు అధిక వ్యయం, కొత్త మోటర్ల కొనుగోలుతో ఆర్థిక భారం పెరుగుతోందని రైతులు ఆరోపించారు. వరి పంట పొట్ట దశలో ఉండగా, సమయానికి నీరందక పొలాలు ఎండిపోతున్నాయని, ఇప్పటికే సాగుకు వేలాది రూపాయలు ఖర్చు చేశామని, పంటలు దెబ్బతింటే తమ పరిస్థితి ఏమిటని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యుత్ కొరత లేకుండా నిరంతర, నాణ్యమైన సరఫరాకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హత్నూర మండలంలోని పలు గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 'తేనెటీగల పెంపకం' లాభాల బాట, ప్రభుత్వ ప్రోత్సాహం

### ఆందోల్‌లో తేనెటీగల యూనిట్ పరిశీలన
### తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు,,రైతు పరిపూర్ణ కృషికి ప్రశంస
### తేనెటీగల పెంపకానికి ప్రభుత్వ రాయితీలు..దరఖాస్తుకు పిలుపు

**సంగారెడ్డి ప్రతినిధి, 8 అక్టోబర్:**

సంగారెడ్డి జిల్లా, ఆందోల్ మండలం, రాంసానిపల్లి గ్రామంలో రైతు పరిపూర్ణ ఏర్పాటు చేసిన తేనెటీగల పెంపకం యూనిట్‌ను జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి సోమేశ్వర రావు సందర్శించారు. ఆయన వెంట మండల ఉద్యాన అధికారి సమత ఉన్నారు. ఈ సందర్భంగా సోమేశ్వర రావు మాట్లాడుతూ, తేనెటీగల పెంపకం రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అందించే మంచి అనుబంధ వృత్తి అన్నారు. తేనెటీగల వల్ల పరపరాగ సంపర్కం జరిగి పంటల దిగుబడి 20 నుండి 30 శాతం వరకు పెరుగుతుందని, స్వచ్ఛమైన తేనె ఉత్పత్తితో పాటు మైనం, రాయల్ జెల్లీ వంటి ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతు పరిపూర్ణ కృషిని అభినందిస్తూ, ఇతర రైతులు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తేనెటీగల పెట్టె (బీ బాక్స్ విత్ కాలనీ) మొత్తం ధర ఆరువేల రూపాయలో రెండువేల నాలుగువందల రాయితీ, తేనె తీసే యంత్రం (హనీ ఎక్స్‌ట్రాక్టర్) ఇతర అనుబంధ పరికరాలకు ఎనిమిదివేల రూపాయల వరకు రాయితీ అందిస్తుందని వివరించారు. ఆసక్తి గల రైతులు, యువతీ యువకులు, మహిళా సంఘాల సభ్యులు తమ మండల ఉద్యాన అధికారిని, లేదా జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, తేనెటీగల పెంపకందారులు పాల్గొన్నారు.



# 'సేవానిరతి'తో పనిచేయాలి కలెక్టర్

### నూతన రిజిస్ట్రార్‌తో కలెక్టర్ భేటీ
### ప్రజలకు పారదర్శక సేవలు అందించాలి
### వేగంగా, సమన్వయంతో పనిచేయాలని సూచన

**సంగారెడ్డి ప్రతినిధి, 8 అక్టోబర్:**

సంగారెడ్డి, అక్టోబర్ 08న, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా నూతనంగా నియమితులైన సందీప్ కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్, సందీప్ కుమార్‌కు అభినందనలు తెలుపుతూ, వృత్తిపట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, రిజిస్ట్రేషన్ శాఖ సేవలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం వేగవంతంగా అందించేలా చర్యలు తీసుకోవాలని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.



# ఎన్‌హెచ్-65 పనులు వేగవంతానికి ఎస్పీ ఆదేశాలు

### పనుల జాప్యంపై ఆరా
### భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి
### ట్రాఫిక్ నియంత్రణకు సూచనలు

**సంగారెడ్డి ప్రతినిధి, 8 అక్టోబర్:**

సంగారెడ్డి చౌరస్తా నుండి మదీనగూడ వరకు జరుగుతున్న ఎన్‌హెచ్-65 రోడ్డు విస్తరణ పనులను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ పరిశీలించారు. పనుల పురోగతిపై ఆర్‌డబీ ఇంజినీర్లు, సంబంధిత కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్న ఎస్పీ, జాప్యానికి గల కారణాలను విశ్లేషించారు. పనుల ఆలస్యం వల్ల ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న సందర్భంలో రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాదాలకు తావులేకుండా తగిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలు, సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో జిన్నారం డిఎస్‌పి ప్రభాకర్, ఇస్నాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు, ఆర్‌డబీ ఇంజినీర్లు, రోడ్డు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



# మోహన్‌లాల్‌తో భాగ్యశ్రీ

హైదరాబాద్, అక్టోబరు 8 :

తొలి బ్లాక్‌బస్టర్ అందుకున్న నటి భాగ్యశ్రీ బోర్సే.. ఇప్పుడు వెండితెరతో పాటు సోషల్ మీడియాలోనూ జోరు చూపిస్తున్నారు. వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే.. తన సినిమా అప్‌డేట్స్, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటూ సందడి చేస్తున్నారు. దీంతో ఇటీవలి కాలంలో ఆమె సోషల్ మీడియా యాక్టివిటీ కూడా టాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది. మాస్ మహారాజా రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'మిస్టర్ బచ్చన్'తో భాగ్యశ్రీ బోర్సే తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. తొలి సినిమాతోనే తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. అయితే కెరీర్ ప్రారంభంలో ఆశించిన స్థాయిలో విజయాలు దక్కకపోవడంతో ఆమెకు కొంతకాలం ఎదురుచూపులు తప్పలేదు. ఇటీవల 'లెనిన్' సినిమాతో తొలి బ్లాక్‌బస్టర్ అందుకున్న భాగ్యశ్రీ.. ఆ చిత్రంలో తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ విజయం తర్వాత ఆమెకు వరుసగా అవకాశాలు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు యువ హీరోల సరసన నటించే ఛాన్స్‌లు దక్కించుకున్నారు. తెలుగు సినిమాలతో బిజీగా ఉన్న సమయంలోనే భాగ్యశ్రీ బోర్సే మలయాళ చిత్ర పరిశ్రమలోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ సరసన నటించే అవకాశం ఆమెకు దక్కినట్లు సమాచారం. 'ఆపరేషన్ గంగ' చిత్రంతో మాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్న ఈ భామ.. తొలి సినిమానే అగ్ర హీరోతో కలిసి నటించే అవకాశం రావడంతో ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలోనూ జోరు బిగ్‌స్క్రీన్‌పై వరుస అవకాశాలు దక్కించుకుంటున్న భాగ్యశ్రీ.. సోషల్ మీడియాలోనూ ఏమాత్రం తగ్గడం లేదు.

# పూనమ్ కౌర్ టాలీవుడ్‌లో చర్చ

హైదరాబాద్, అక్టోబరు 8 :

నటి పూనమ్ కౌర్ మరోసారి సోషల్ మీడియా పోస్టులతో వార్తల్లో నిలిచారు. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె.. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటూ తరచూ పరోక్ష వ్యాఖ్యలు చేస్తుంటారు. ఎవరినీ నేరుగా ప్రస్తావించకుండా వివిధ అంశాలపై స్పందించే పూనమ్ కౌర్ తాజాగా చేసిన వరుస పోస్టులు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి. దర్శకుడిపై సంచలన వ్యాఖ్యలు తాజాగా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఓ దర్శకుడిని ఉద్దేశిస్తూ పూనమ్ కౌర్ తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఆదర్శాలు లేని వ్యక్తి అంటూ విమర్శలు చేస్తూ.. నటీనటులు, నిర్మాతలు ఆయనకు దూరంగా ఉండాలని సూచించినట్లు సమాచారం. అంతేకాకుండా హనీ ట్రాప్, మూఢనమ్మకాల పేరుతో మోసం చేసే విధానాలను ప్రస్తావిస్తూ తీవ్ర ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. అయితే తన పోస్టులో ఆ దర్శకుడి పేరును మాత్రం ఆమె వెల్లడించలేదు.



# వైరల్‌గా సదా ఫొటో.. గుర్తుపట్టారా?

హైదరాబాద్, అక్టోబరు 8 :

సోషల్ మీడియాలో అప్పుడప్పుడు కనిపించే కొన్ని పాత ఫొటోలు నెటిజన్లను ఒక్కసారిగా గత జ్ఞాపకాల్లోకి తీసుకెళ్తుంటాయి. తాజాగా అలాంటి ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో కనిపిస్తున్న హీరోయిన్ ఎవరో గుర్తుపట్టారా? ఒకప్పుడు స్టార్ హీరోల సరసన నటిస్తూ టాలీవుడ్‌లో సందడి చేసిన ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా? అందాల నటి సదా. 'జయం'తో గుర్తింపు 2002లో విడుదలైన 'జయం' సినిమాతో సదా హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ చిత్రంలో ఆమె పోషించిన పాత్ర, సహజమైన నటన, అమాయకమైన లుక్ అప్పట్లో ప్రేక్షకులను, ముఖ్యంగా యువతను ఆకట్టుకున్నాయి. 'జయం' విజయం తర్వాత సదాకు వరుస అవకాశాలు రావడంతో టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారారు. 'అపరిచితుడు'తో మరోసారి తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లోనూ సదా పలు సినిమాల్లో నటించారు. విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా విక్రమ్ సరసన నటించిన 'అపరిచితుడు' సినిమా ఆమె కెరీర్‌లో చెప్పుకోదగ్గ చిత్రంగా నిలిచింది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లోనూ నటించి మెప్పించారు. మారని అందం.. అభిమానుల సందడి ఒకప్పుడు వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన సదా ప్రస్తుతం సినిమాల్లో చాలా అరుదుగా కనిపిస్తున్నారు. అయితే సోషల్ మీడియా ద్వారా అభిమానులకు మాత్రం అందుబాటులో ఉంటున్నారు.



# 'రణబలి' ట్రైలర్ వచ్చేది ఎప్పుడంటే?

హైదరాబాద్, అక్టోబరు 8 :

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'రణబలి'. 'శ్యామ్ సింగ రాయ్' ఫేమ్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అక్టోబరు 16న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. విజయ్, రష్మిక మరోసారి జంటగా నటిస్తుండటంతో సినిమాపై మొదటి నుంచే ఆసక్తి ఏర్పడింది. నేడు ట్రైలర్ విడుదల సినిమా విడుదలకు సమయం దగ్గరపడటంతో చిత్రబృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 'రణబలి' ట్రైలర్‌ను నేడు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. దాదాపు 3 నిమిషాల 47 సెకన్ల నిడివితో ఉండనున్న ట్రైలర్ సాయంత్రం 6.03 గంటలకు డిజి ట ల్‌గా విడుదల కానుంది. ట్రైలర్ విడుదలకు ముందు హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో ప్రత్యేక మీడి యా సమావేశాన్ని నిర్వ హించనున్నారు. మధ్యాహ్నం 2 గంట ల తర్వాత జరగ నున్న ఈ కార్యక్ర మంలో చిత్ర తారా గణం, సాంకేతిక బృందం పాల్గొని సిని మా విశేషాలను పం చుకోనున్నారు. భారీ స్థాయిలో నిర్మా ణం మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'రణబలి'ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. పీరియడ్ నేపథ్యం, భారీ యాక్షన్ సన్నివేశాలతో రూపొందుతున్న ఈ చిత్రానికి నిర్మాణ విలువలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో సినిమాను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. మరోవైపు చిత్ర సంగీతానికి కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రముఖ సంగీత ద్వయం అజయ్–అతుల్ ఈ సినిమాకు స్వరాలు సమకూ రుస్తున్నారు. విజయ్, రష్మిక కాంబినేషన్, రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం, పీరియడ్ యాక్షన్ నేపథ్యం నేపథ్యంలో ట్రైలర్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



# నానా పటేకర్ మృతిపై రజనీ నివాళి

ప్రముఖ నటుడు నానా పటేకర్ మృతి సినీ పరిశ్రమలో తీవ్ర విషాదాన్ని నింపింది. 75 ఏళ్ల నానా పటేకర్ గురువారం తెల్లవారుజామున గోవాలోని తన నివాసంలో గుండెపోటుకు గురై కన్నుమూశారు. ఆయనను మణిపాల్ ఆసుపత్రికి తరలించినప్పటికీ వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఉదయం 5.20 గంటలకు ఆయన మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. 'నా ప్రియమైన మిత్రుడు నానాజీ' నానా పటేకర్ మృతిపై సూపర్‌స్టార్ రజనీకాంత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన ప్రియమైన మిత్రుడు ఇక లేరన్న విషయాన్ని నమ్మలేకపోతున్నానంటూ ఎక్స్ వేదికగా భావోద్వేగ నివాళి అర్పించారు. నానా కుటుంబ సభ్యులు, ఆప్తులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'కాలా'లో కలిసి నటించిన రజనీ, నానా పా. రంజిత్ దర్శకత్వంలో 2018లో తెరకెక్కిన 'కాలా' చిత్రంలో రజనీకాంత్, నానా పటేకర్ కలిసి నటించారు. ఇందులో నానా పటేకర్ ప్రతినాయకుడైన హరిదాదా పాత్రలో కనిపించి తనదైన నటనతో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంతో వీరిద్దరి మధ్య ఏర్పడిన అనుబంధాన్ని రజనీ తన నివాళిలో గుర్తుచేసుకున్నారు. నానా పటేకర్ హిందీ, మరాఠీ చిత్ర పరిశ్రమల్లో దాదాపు ఐదు దశా బ్దాల పాటు వైవిధ్యభరిత పాత్రలతో ప్రేక్షకులను అలరించారు. ఆయన మరణంతో సినీ ప్రముఖులు వరుసగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు.




Apublished by KALIDINDI SUMALATHA, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of RS USAR PUBLICATIONS, 1ST FLOOR, H.NO. 59-5-7, PALLAVI APARTMENTS, ITI COLLEGE ROAD, OPP MRF SHOW ROOM, VIJAYAWADA, N T R, ANDHRA PRADESH - 520008 edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by KALIDINDI SUMALATHA at KING DIGITAL OFFSET PRINTERS, 24 11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA 4TH LINE, MAHALAKSHMIGUDI NEAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003. PRGI NO: APTEL/26/A7657, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467